క్లుప్తంగా

వార్డు కార్యదర్శులకు శిక్షణ



పటమట(విజయవాడతూర్పు): వార్డు కార్యదర్శులు వారికి కేటాయించిన విధులను సక్రమంగా నిర్వహించేందుకు, పనితీరును మరింత మెరుగు పరిచేందుకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని వీఎంసీ అదనపు కమిషనర్(ప్రాజెక్ట్స్) కె.వి సత్యవతి అన్నారు. కమిషనర్-డైరెక్టర్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ఆదేశాలతో గొల్లపూడిలోని గోగినేని టవర్స్‌లో వార్డు కార్యదర్శుల శిక్షణ శిబిరాన్ని ఆమె బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొదటి బ్యాచ్‌లో మొత్తం 65 మంది కార్యదర్శులకు శిక్షణ ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్-2 అనసూయదేవి పాల్గొన్నారు.

విశ్రాంత హోంగార్డ్ కుటుంబానికి ఆర్థిక సాయం



భవానీపురం(విజయవాడపశ్చిమ): పదవీ విరమణ చేసిన హోంగార్డ్ కుటుంబానికి పోలీస్ కమిషనర్ టీకే రాణా ఆర్థిక సాయం అందచేశారు. విజయవాడ నగరంలో పని చేస్తున్న హోంగార్డ్‌ల్లో ఎవరైనా మరణించినా లేదా పదవీ విరమణ చేసినా వారు ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా నగరంలో పని చేస్తున్న హోంగార్డులు అందరూ స్వచ్ఛందంగా వారికి ప్రతి నెలా వచ్చే వేతనం నుంచి ఆయా హోంగార్డ్ కుటుంబాలకు ఆర్థిక ఆసరా కల్పిస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఎన్టీఆర్ జిల్లాలో హోంగార్డ్‌గా విధులు నిర్వహిస్తున్న కె జయపాల్ గత నెల 15వ తేదీన పదవీ విరమణ చేశారు. ఈ నేపథ్యంలో బుధవారం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో కమిషనర్ టీకే రాణా జయపాల్‌కు రూ.5లక్షల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో హోంగార్డ్ ఆర్ఐ కృష్ణ, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ జేఏసీ ఉద్యోగుల నిరసన

ఇబ్రహీంపట్నం:రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల ఐక్య కార్యాచరణ కమిటీ పిలుపు మేరకు ఎన్టీటీపీఎస్ గేటు వద్ద ఏడోరోజు నిరసన కార్యక్రమం కొనసాగింది. జేఏసీ నాయకులు శ్రీధర్ మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధిలో తలమానికంగా ఉండే విద్యుత్ ఉద్యోగులు సమస్యలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిష్కరిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. కాంట్రాక్ట్ కార్మికులను క్రమబద్ధీకరించాలని, సమానపనికి సమానవేతనం ఇవ్వాలని, కారుణ్య నియామకాలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరశింగరావు, ఎన్‌సీహెచ్ శ్రీనివాస్, మహేష్, ఎం.మోహనరావు, జాన్‌రాజ్, పాలప్రసాద రావు, కార్మికులు పాల్గొన్నారు.

వైద్య సేవలు ప్రజల వద్దకు చేరాలి



గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన కుటుంబ డాక్టర్ వైద్య సేవలు ప్రజల వద్దకు చేరాలని డీఎంహెచ్‌వో ఎం.సుహాసిని అన్నారు. మండలం పరిధిలోని గుంటుపల్లి వెల్‌నెస్ సెంటర్‌ను ఆమె బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వెల్‌నెస్ సెంటర్‌లో రోజువారీ వచ్చే రోగులపై ఆరాతీశారు. రోగులకు అందుతున్న వైద్య సదుపాయాలు పరిశీలించారు. ప్యామిలీ డాక్టర్ కార్యక్రమం తీరు అడిగి తెలుసుకున్నారు. చిన్నారులు వ్యాధి నిరోధక టీకాల రిజిస్టర్ పరిశీలించి తల్లిపాల వారోత్సవాల అమలు అడిగి తెలుసుకున్నారు. గర్భిణులకు సరఫరా చేస్తున్న వైఎస్సార్ పోషణ అభియాన్ కిట్లు పంపిణీ చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సబ్బంది పాల్గొన్నారు.

అత్తింటి వారిపై వరకట్నం వేధింపుల కేసు

పెనమలూరు: వరకట్నం కోసం వేధిస్తున్న అత్తింటి వారిపై పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ ఎం.కిషోర్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం యనమలకుదురు గ్రామానికి చెందిన లంకా జ్యోతి గత 2016లో ఘంటశాల మండలం తెలుగురావుపాలెంకు చెందిన లాంకా రమేష్‌ను కట్నకానుకలు ఇచ్చి వివాహం చేసుకుంది. వీరికి పాప పుట్టింది. భర్త రమేష్ గుడ్లవల్లేరు కాలేజీలో అధ్యాపకుడిగా పని చేస్తున్నాడు. కాగా పెళ్లి సమయంలో ఇచ్చిన కట్నకానుకలు చాల్లేదని భర్త, అత్తింటివారు వేధిస్తుండటంతో బాధితురాలు పుట్టింటికి వచ్చి పోలీసులను ఆశ్రయించింది. భర్తతోపాటు మామ రాజారావు, బావ సాంబశివరావు, తోటికోడలు ప్రమీళా, ఆడపడుచు సంతోషమ్మపై పోలీసులకు ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేశారు.

పింగళి వెంకయ్యకు ఘన నివాళి

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): జాతీయ జెండా రూపకర్త పింగళి వెంకయ్య జయంతి వేడుకలు బుధవారం పాలప్రాజెక్టు సమీపంలోని పింగళి వెంకయ్య స్వచ్ఛంద సంస్థ కార్యాలయం వద్ద ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మిలు విచ్చేసి పింగళి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జాతీయ జెండాను ఆవిష్కరించిన ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, మేయర్ భాగ్యలక్ష్మితో కలిసి కేక్ కట్ చేశారు. విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నగర ప్రధాన కార్యదర్శి రాయన నరేంద్ర, 47వ డివిజన్ నాయకులు, సింహాచలం దేవస్థాన పాలక మండలి సభ్యులు కూరాకుల నాగ, షేక్. ఆదిల్, స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు అంగడాల అనిత తదితరులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, మేయర్ భాగ్యలక్ష్మి

స్టేడియం నిర్మాణ పనుల పరిశీలన

పటమట(విజయవాడతూర్పు): పశ్చిమ నియోజకవర్గం విద్యాధరపురంలో నిర్మించనున్న స్టేడియం నిర్మాణ పనులను కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ బుధవారం సాయంత్రం అధికారులతో కలిసి పరిశీలించి పలు సూచనలు చేశారు. స్టేడియం ఫౌండేషన్ నిర్మాణ పనులను పరిశీలించి అక్కడ ఉన్న వర్షపునీటిని గుంటలను యుద్ధప్రాతిపదికన పూడ్చాలని, వర్షపునీటిని డ్రెయిన్‌లకు మళ్లించాలని ఆదేశించారు. అవసరమైన చోట్ల మోటార్లు ఏర్పాటు చేసి ఎక్కడ వర్షపు నీరు నిల్వలు లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. అనంతరం ఆయన కొత్తపేట కె.టి రోడ్‌లో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను పరిశీలించారు. నెహ్రూ బొమ్మ సెంటర్ నుంచి చిట్టినగర్ జంక్షన్ వరకు ఒక వైపు రోడ్ పనులు అన్నీ పూర్తయినందున ట్రాఫిక్ వ్యవస్థకు ఇబ్బంది కలుగకుండా రోడ్ పై ఉన్న నిర్మాణపు సామగ్రి, మట్టిని తొలగించి రోడ్డును వెంటనే వినియోగంలోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నారాయణ మూర్తి పాల్గొన్నారు



స్టేడియం నిర్మాణ పనులను పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్

తుది దశకు స్మృతివనం పనులు

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ స్వరాజ్యమైదానంలో జరుగుతున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహం, స్మృతివనం పనులు తుది దశకు చేరుకున్నాయని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. ఆయన విగ్రహ నిర్మాణ పనులను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయవాడ నడిబొడ్డున సీఎం వైఎస్ జగన్ సారథ్యంలో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న 125 అడుగుల అంబేడ్కర్ స్మృతి వనాన్ని పర్యాటక ప్రదేశంగా తీర్చిదిద్దనున్నామని తెలిపారు. అంబేడ్కర్ స్మృతి వనం లోపల జరుగుతున్న సీలింగ్, ప్లాస్టింగ్ పనులను త్వరగా పూర్తిచేయాలని, ఎలాంటి పొరపాట్లు లేకుండా నాణ్యతా ప్రమాణాలు పాటించాలని అధికారులకు సూచించామన్నారు. నిత్యం 500 మందికి పైగా కూలీలు పనిచేస్తున్నారన్నారు. కేపీసీ ప్రాజెక్టు డైరెక్టర్ కె.అనిల్ కుమార్ మేనేజర్ కె.కృష్ణ మోహన్ పాల్గొన్నారు.

10, 11 తేదీల్లో నల్లకుంట దర్గా ఉరుసు ఉత్సవాలు

రాష్ట్ర వక్ఫ్‌బోర్డ్ మాజీ డైరెక్టర్, ముతవలి షేక్ ఖాజా

భవానీపురం(విజయవాడపశ్చిమ): నల్లకుంటలోని హజరత్ సయ్యద్ మజీలీ బాబా రహమతుల్లా అలైహి అవులియా కరీం దర్గా ఉరుసు ఉత్సవాలను ఈ నెల 10, 11 తేదీలలో నిర్వహించనున్నట్లు రాష్ట్ర వక్ఫ్‌బోర్డ్ మాజీ డైరెక్టర్, ముతవలి షేక్ ఖాజా తెలిపారు. భవానీపురంలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తొలి రోజు గంధ మహోత్సవం, రెండో రోజు చిరాగ్ (దీపారాధన) నిర్వహిస్తామని చెప్పారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. తనను రెండో సారి ముతవలీగా నియమించేందుకు సహకరించిన ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాషా, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లాకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో జాయింట్ ముతవలి షేక్ ముస్తఫా, సూఫీ మతగురువు అల్తాఫ్ రజా, ఫారూఖ్ మౌలానా, కార్పొరేటర్లు ఎండీ ఇర్ఫాన్, అర్షద్ పాల్గొన్నారు.



దర్గా ఉరుసు ఉత్సవాల పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఖాజా, అల్తాఫ్ రజా

ఆరోపణలు నిరూపించలేకపోయారు

రెండున్నరేళ్లుగా ముస్లిం వెల్ఫేర్ సొసైటీ, ముస్లిం యునైటెడ్ ఫ్రంట్ పేరుతో తనపై అసత్య ఆరోపణలు చేస్తూ సోషల్ మీడియాలో వీడియోలు పోస్ట్ చేస్తున్నారని, ఇప్పటికీ ఒక్కటి కూడా నిరూపించలేకపోయారని రాష్ట్ర వక్ఫ్‌బోర్డ్ మాజీ డైరెక్టర్, ముతవలి షేక్ ఖాజా అన్నారు. బ్లాక్‌మెయిల్ చేసి డబ్బు గుంజాలని చూస్తే సహించేది లేదని, చట్టపరంగా వారిపై సివిల్, క్రిమినల్ చర్యలు తీసుకుంటామని తెలిపారు.

గొప్ప మనసున్న సీఎం వైఎస్ జగన్

ఎమ్మెల్యే మల్లాది విష్ణు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): పేదల ఆపద్బాంధవుడిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల గుండెల్లో చిరస్థాయిగా నిలిచి పోతారని ప్లానింగ్ బోర్డు వైస్ ఛైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. స్థానిక 59వ డివిజన్ సింగ్ నగర్ ప్రాంతానికి చెందిన షేక్ ఇబ్రహీం(29) క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ ఇటీవల మృతిచెందాడు. ఆ పేద కుటుంబ సభ్యులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించిన ఎమ్మెల్యే విష్ణు విషయాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన తన నిధుల నుంచి మూడు లక్షల రూపాయలను మంజూరు చేసి, వారి బాసటగా నిలిచారు. దీనికి సంబంధించిన చెక్కును ఎమ్మెల్యే విష్ణు బుధవారం ఇబ్రహీం కుటుంబ సభ్యులకు అందజేశారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేసిన సాయం ఎన్నటికీ మరచిపోలేనిదన్నారు. తమ జీవితాంతం ఆయనకు రుణపడి ఉంటామని ఇబ్రహీం తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు తెలిపారు.



ఇబ్రహీం తల్లికి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

రోడ్డు అభివృద్ధి పనులు వేగవంతం

రూ.3.65 కోట్లతో పనులు

పాయకాపురం(విజయవాడరూరల్): కండ్రిక జంక్షన్‌వద్ద ఆర్అండ్‌బీ రోడ్డు ఎండ్‌టూఎండ్ పావర్ బ్లాక్స్ అండ్ రోడ్డు వెడల్పు చేసే అభివృద్ధి పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. రోడ్డు పనులను వీఎంసీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు శ్రీనివాస్ బుధవారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కండ్రిక జంక్షన్ వద్ద నూజివీడు ఆర్అండ్‌బీ రోడ్డు వెంబడి సైకిల్‌ట్రాక్, వాకింగ్ ట్రాక్, గ్రీనరీ ఉండే విధంగా రోడ్డు అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు. 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.3.65 కోట్లతో (ఎయిర్ క్వాలిటీ ఇంప్రూవ్‌మెంట్) నిర్మించే పావర్‌బ్లాక్స్ వలన దుమ్ముధూళి తగ్గించేందుకు ప్రాధాన్యం ఇస్తూ పనులు జరుగుతున్నాయన్నారు. నగరంలో మొదటి విడతగా ఎయిర్ క్వాలిటీ ఇంప్రూవ్‌మెంట్ రోడ్డు నిర్మాణం జరుగుతుందన్నారు. ప్రకాష్‌నగర్ నుంచి సుమారు 400 మీటర్ల పొడవు వుండేలా నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు.



కండ్రిక వద్ద డ్డు పనులు పర్యవేక్షిస్తున్న వీఎంసీ ఈఈ శ్రీనివాస్

ఎల్బీఆర్‌సీఈ అధ్యాపకురాలికి డాక్టరేట్ ప్రదానం

మైలవరం: లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఎంబీఏ విభాగంలో అధ్యాపకురాలు ఆర్.జయలక్ష్మి విక్రమపురి యూనివర్సిటీ కామర్స్ విభాగంలో కాస్ట్ క్రెడిట్ టు మెరైన్ ఫిషర్‌మెన్ ఇన్ ప్రకాశం జిల్లా ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అనే అంశంపై చేసిన పరిశోధనకు పీహెచ్‌డీ అవార్డు అందుకున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.అప్పారావు బుధవారం తెలిపారు. ఈ పరిశోధనను ప్రొఫెసర్ పి. వెంకటరావు(రిటైర్డ్) కామర్స్ విభాగం, విక్రమపురి యూనివర్సిటీ, కావలి పర్యవేక్షణలో చేయడం జరిగిందన్నారు. మత్స్యకారులకు రుణ సదుపాయాలు మీద అవగాహన కల్పించడంతో పాటు వారి రుణ అవసరాలను తీర్చడంలో మార్గం సుగమం అవుతుందన్నారు. ఈ సందర్భంగా డాక్టరేట్ పొందిన జయలక్ష్మిని ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పారావు, ఎంబీఏ విభాగాధిపతి డాక్టర్ ఆదిశేషారెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది అభినందించారు.



జయలక్ష్మిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పారావు, ప్రొఫెసర్ ఆదిశేషారెడ్డి

మహిళపై దాడికి పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): మహిళపై దాడికి పాల్పడిన వ్యక్తిపై కొత్తపేట పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు చేపల మార్కెట్, శివాలయం ప్రాంతానికి చెందిన ఎండీ షేర్‌బాను, షహీన్ షా భార్యభర్తలు. వీరికి ఇద్దరు కుమార్తెలు కాగా వారికి వివాహాలయ్యాయి. చిన్న అల్లుడు గౌస్, స్నేహితుడైన ఇంతియాజ్ ఇద్దరు కలిసి ఆన్‌లైన్‌లో వస్తువులు తెప్పించుకున్నారు. కొద్ది రోజులుగా ఇంతియాజ్ షేర్‌బాను ఇంటికి వచ్చి గౌస్ కోసం ఆరా తీస్తున్నాడు. అయితే ఇంతియాజ్ వచ్చిన సమయంలో గౌస్ ఇంట్లో ఉండటం లేదు. ఇదే విషయాన్ని చెబుతుండగా, మంగళవారం అదేవిధంగా ఇంటికి వచ్చి ఆరా తీశాడు. అయితే గౌస్ ఇంట్లో లేడని ఇంతియాజ్‌కు చెప్పడంతో ఆవేశంతో, కోపంతో షేర్‌బానుపై దాడి చేసి ఇష్టం వచ్చినట్లు కొట్టాడు. దీంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

తెలుగు కళామతల్లి ముద్దుబిడ్డ బళ్లారి రాఘవ



మధురానగర్(విజయవాడసెంట్రల్): తొలితరం తెలుగు కళామతల్లి ముద్దుబిడ్డ బళ్లారి రాఘవ అని నాటక రంగానికి ఆయన చేసిన సేవలు నిరుపమానమని డిప్యూటీ మాజీ మేయర్ సామంతపూడి నరసరాజు పేర్కొన్నారు. స్థానిక ముత్యాలంపాడు అల్లూరి సీతారామరాజు గ్రంథాలయం వజ్రోత్సవాలలో భాగంగా బుధవారం నాటకరంగ ప్రముఖులు బళ్లారి రాఘవ జయంతి వేడుకలు జరిగాయి. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని అల్లూరి సీతారామరాజు సాంస్కృతిక సంఘం అధ్యక్ష,కార్యదర్శులు ఎస్ వెంకటేశ్వరరాజు, డీ భాస్కరరాజు కోశాధికారి డీజేపీఎస్‌రాజు, గ్రంథాలయం అధ్యక్ష,కార్యదర్శులు సుబ్బరాజు, సుబ్బరాజుతో కలిసి బళ్లారి రాఘవ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

ఆరోగ్యకేంద్రం సేవలను సద్వినియోగం చేసుకోవాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యకేంద్రం సేవలను సద్వినియోగం చేసుకుని ఆరోగ్యకర జీవనం సాగించాలని మధురానగర్ ఆరోగ్యకేంద్రం వైద్యులు డాక్టర్ అంజు సూచించారు. స్థానిక మధురానగర్ ఆరోగ్యకేంద్రంలో బుధవారం ఆరోగ్య అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె వర్షాలు కురుస్తున్న దృష్ట్యా కాచిచల్లార్చిన నీటినే తాగాలని సూచించారు. అలాగే ఏ మాత్రం అనారోగ్య సమస్యలు వచ్చినా సమీపంలోని ఆరోగ్యకేంద్రంలో సంప్రదించాలన్నారు. ఆశ కార్యకర్తల సేవలను వినియోగించుకోవాలని సూచించారు. గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. అనంతరం గర్భిణులు, చిన్నారులకు వ్యాక్సిన్ వేశారు.

రేపు సంకట చతుర్థి

మధురానగర్(విజయవాడసెంట్రల్): అయోధ్యనగర్ శ్రీదత్తసాయి శివకామేశ్వరీపీఠంలో శుక్రవారం సంకటచతుర్థి సందర్భంగా శ్రీవిజయగణపతి స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నట్లు పీఠం వ్యవస్థాపకులు అవ్వా హేమసుందర వరప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. లోక కళ్యాణార్థం స్వామికి రుద్రాభిషేకం, అర్చనలు జరుగుతాయన్నారు. భక్తులు స్వామిని దర్శించుకుని పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం

డీసీపీ విశాల్ గున్నీ

గుణదల (విజయవాడ తూర్పు): అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం మోపి శాంతి భద్రతలు పరిరక్షించే దిశగా పోలీసు విభాగం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని డీసీపీ విశాల్ గున్నీ తెలిపారు. మాచవరం పోలీస్ స్టేషన్‌ను బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ నిర్వహిణ, సిబ్బంది పని తీరు, విధులు, వంటి విషయాలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమైన కేసుల దర్యాప్తు, వివిధ క్రైం రికార్డులను పరిశీలించారు. మాచవరం సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం స్టేషన్ పరిధిలోని గంగిరెద్దుల దిబ్బ కొండ ప్రాంతంలో పర్యటించారు. స్థానికులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసు యంత్రాంగం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు. శాంతి భద్రతలకు సంబంధించిన ఏ సమస్యలైనా పోలీసులకు తెలపాలని స్థానికులను కోరారు. మాచవరం సీఐ గుణరామ్, ఎస్సైలు నాగమణి, తేజ పాల్గొన్నారు.



స్థానికులతో మాట్లాడుతున్న డీసీపీ విశాల్ గున్నీ

వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్ల పంపిణీ



45వ డివిజన్‌లో కిట్లను పంపిణీ చేసిన కార్పొరేటర్ మాధురి లావణ్య



51వ డివిజన్లో కిట్లను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ రాజేష్

భవానీపురం(విజయవాడపశ్చిమ): గర్భిణులు, బాలింతలు, చిన్నారులలో పౌష్టికాహార లోపం వలన కలిగే రక్తహీనతను నివారించేందుకు బియ్యం, కందిపప్పు, నూనె, పాలు, కోడిగుడ్లు, రాగిపిండి, అటుకులు, వేరుశనగ చిక్కి, కర్జూరం, బెల్లం వంటి పౌష్టికాహారంతోకూడిన వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను పంపిణీ చేశారు. మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బుధవారం 38, 45 డివిజన్లలోని అంగన్‌వాడీ కేంద్రాలలో కిట్లను అందజేశారు. విద్యాధరపురం 38వ డివిజన్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన కిట్ల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా స్థానిక కార్పొరేటర్ షేక్ రెహమతున్నీసా పాల్గొన్నారు. ఐసీడీఎస్ సెక్టార్-1 సూపర్‌వైజర్ ప్రశాంతి పాల్గొన్నారు.

45వ డివిజన్ పరిధిలో..

విద్యాధరపురం 45వ డివిజన్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రంలో స్థానిక కార్పొరేటర్ మైలవరపు మాధురి లావణ్య గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను పంపిణీ చేశారు.

51వ డివిజన్లో..

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): 51వ డివిజన్‌లోని అంగన్‌వాడీ పాఠశాలలో జగనన్న సంపూర్ణ పోషకాహార పథకం కిట్ల పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం ఆ డివిజన్ కార్పొరేటర్ మరుపిళ్ల రాజేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకుంటూ తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

మణిపూర్ ఘటన దురదృష్టకరం



శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు

గుణదల (విజయవాడ తూర్పు): దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తున్న ప్రస్తుత తరుణంలో కొంత మంది మత ఛాందసులు చేస్తున్న ఆకృత్యులు సిగ్గు చేటని పలువురు క్రైస్తవులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల మణిపూర్‌లో జరిగిన దుర్ఘటనకు వ్యతిరేకంగా గుణదలలోని బిషప్ గ్రాసి పాఠశాల నుంచీ బీఆర్‌టీఎస్ రోడ్డు వరకు శాంతిర్యాలీని బుధవారం నిర్వహించారు. క్రైస్తవ సంగీత కళాకారుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ క్రైస్తవ గాయకుడు స్టీవెన్ సన్ మాట్లాడుతూ భారత దేశం లౌకిక రాజ్యమని. ఇక్కడ అన్ని కులాల, మతాలకు చెందిన ప్రజలు జీవించే హక్కు ఉందని స్పష్టం చేశారు. క్రైస్తవుల పై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా దేశ వ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తుతున్నాయన్నారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో వాయిద్య కళాకారులు, గాయకులు ప్లకార్డులు చేతపట్టి శాంతి ర్యాలీ నిర్వహించారు. గుణదల బిషప్ గ్రాసి పాఠశాల ప్రాంగణం నుంచి ప్రారంభమైన ఈ ర్యాలి బీఆర్‌టీఎస్ రోడ్డు వరకు కొనసాగింది. కార్యక్రమంలో పాస్టర్లు కోట కరుణకుమార్, జాన్ వెస్లీ, డానియెల్ రత్నం పాల్గొన్నారు.

విద్యార్థులు పోటీతత్వాన్ని తట్టుకోవాలి

పటమట(విజయవాడ తూర్పు): విద్యార్థులు తమలోని నైపుణ్యాలను గుర్తించి వాటికి మరింత మెరుగులు దిద్దాలని, ఎప్పటికప్పుడు విషయ పరిజ్ఞానాన్ని, కరెంట్ అఫైర్స్‌ను తెలుసుకోవాలని దక్షిణ మధ్య రైల్వే డివిజనల్ మేనేజర్ నరేంద్ర ఏ పాటిల్ అన్నారు. స్టెల్లా కళాశాల్లో మురళీకృష్ణ ట్రస్ట్, స్కూల్‌ఫర్ ఫ్యూచర్-పవర్‌స్కిల్స్ ప్రోగ్రాంను ఆయన బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కాలానుగుణంగా వచ్చే విద్యావకాశాలు, ఉపాధి అవకాశాలపై అవగాహనతో ఉండాలన్నారు. పెరుగుతున్న పోటీతత్వాన్ని తట్టుకునేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. ఎయిర్‌పోర్టు డైరెక్టర్ లక్ష్మీకాంత రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు కచ్చితమైన లక్ష్యాన్ని ఎంచుకోవాలని, అందుకు అనుగుణంగా ప్రణాళిక రూపొందించుకుని భవిష్యత్తును నిర్మించుకోవాలన్నారు. ఇటలీకి చెందిన కేర్‌టూ యాక్షన్ డైరెక్టర్ డాక్టర్ ఆంటోనియా బెన్ని మాట్లాడుతూ ఐదు వేల మంది విద్యార్థున తమ ప్రాజెక్టుద్వారా లబ్ధిపొందుతారని, పవర్‌స్కిల్స్ ప్రోగ్రాం విద్యార్థులకోసం రూపొందించిందన్నారు. కార్యక్రమంలో శ్రీధర్ సీసీఈ డైరెక్టర్ శ్రీధర్, ఎంఎస్‌రావ్ అసోసియేట్స్ మేనేజింగ్ పార్టనర్ టి.రామమోహనరావు, మురళీకృష్ణ ట్రస్ట్ డైరెక్టర్ రాజారపు వెంకటస్వామి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జస్వింత క్వాడ్రస్ పాల్గొన్నారు.



మాట్లాడతున్న దక్షిణ మధ్య రైల్వే డివిజనల్ మేనేజర్ నరేంద్ర ఏ. పాటిల్

వేలేరు మెగా ఆయిల్‌పామ్ ప్లాంటేషన్ నేడు

హనుమాన్‌జంక్షన్‌రూరల్: బాపులపాడు మండలం వేలేరులో గురువారం మెగా ఆయిల్‌పామ్ ప్లాంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మండల ఉద్యాన అధికారి హరిచంద్ బుధవారం తెలిపారు. జాతీయ స్థాయిలో చేపట్టిన మెగా ఆయిల్‌పామ్ ప్లాంటేషన్ కార్యక్రమంలో భాగంగా జిల్లా ఉద్యాన శాఖ, పతాంజలి ఫుడ్స్ సంయుక్త ఆధ్వర్యంలో వేలేరులో పెద్ద ఎత్తున ఆయిల్‌పామ్ మొక్కలు నాటుతామన్నారు. అనంతరం సస్యరక్షణ చర్యలపై రైతులకు ఉద్యాన శాస్త్రవేత్తలతో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో ఆయిల్‌పామ్ రైతులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ

పెనమలూరు: ఉత్తమ ప్రతిభ చాటిన ఇంజినీరింగ్ విద్యార్థులకు అమెరికాకు చెందిన నార్త్, సౌత్ ఫౌండేషన్ ఉపకార వేతనాలు పంపిణీ చేసింది. ఈ మేరకు గంగూరు ధనేకుల ఇంజినీరింగ్ కాలేజీలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఇంజినీరింగ్ విద్యార్థులకు రూ. 1.70 లక్షలు ఉపకార వేతనాలు విజయవాడ చాప్టర్ నార్త్, సౌత్ ఫౌండేషన్ కోఆర్డినేటర్ సూరపనేని వెంకటరత్నం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కడియాల ప్రసాద్, ప్రొఫెసర్ డాక్టర్ హరిప్రసాద్ విద్యార్థులు పాల్గొన్నారు.